నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 26 జూలై 2024 | VIKARABAD

కోతల బడ్జెట్

- హామీలకు అనుగుణంగా కేటాయింపులేవి?
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఊసేలేదు
- పంచాయతీలకు ప్రత్యేక నిధులు నిల్
- సంక్షేమ పథకాలను అటకెక్కించే ప్రయత్నం
- పారిశ్రామిక రంగానికి మొండి చేయి
- గొల్లకురుమలు, మత్స్యకారులను విస్మరించిన రేవంత్ సర్కార్
- రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపై సబ్బండ వర్గాల అసంతృప్తి

కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నదానికి.. చేస్తున్నదానికి పొంతన ఉండడంలేదు అనడానికి గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిలువెత్తు నిదర్శనం. రూ.2,91,159 కోట్లతో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీనే తప్ప.. అక్కరకొచ్చేది కాదని తేలిపోయింది. హామీలకు తగ్గ కేటాయింపులు జరపకపోవడంతో అంతా ఒట్టి మాటలేనన్న! విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి అవకాశాలతోపాటు, ప్రజల జీవన స్థితి గతులను మార్చే కొత్త పథకాలేవీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేలా నిధుల కేటాయింపులు జరగలేదు. ఫార్మాసిటీని రద్దు చేసి టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తామన్న ప్రకటనను సైతం అటకెక్కించింది. మెట్రో విస్తరణకు మొక్కుబడిగానే నిధులను కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటివనరైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో మొండి చేయి చూపించారు. గొర్రెల పంపిణీ, దళితబంధు వంటి అనేక సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో మంగళం పాడడంతో ఉమ్మడి జిల్లాలోని సబ్బండ వర్గాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

-వికారాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ)

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ఇటీవల పర్యటించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాపై వరాల జల్లు కురిపించారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో వివిధ యూనివర్సిటీలను, మెడికల్, టూరిజం, పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రీజినల్ రింగ్ రోడ్డుతోపాటు భవిష్యత్తులో రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసుకోబోతున్నామని హామీ ఇచ్చారు. న్యూయార్క్ సిటీతో పోటీపడేలా మహేశ్వరంలో ఒక అద్భుతమైన నగరం నిర్మించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని కూడా ప్రకటించారు. ఊటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అనువుగా మార్చుతామని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతున్నదని, ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా జిల్లాను తీర్చిదిద్దుతామన్నారు. అయితే ఈ దిశగా బడ్జెట్‌లో ఎటువంటి నిధుల కేటాయింపులను ప్రభుత్వం జరపలేదు. రద్దు చేసిన ఫార్మాసిటీ ప్రాంతంలో టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తామన్నది కూడా బూటకమేనని ప్రస్తుత బడ్జెట్‌తో తేలిపోయిందని ఈ ప్రాంత ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కేసీఆర్ హయాంలోనే ఉన్న హయత్‌నగర్‌కు మెట్రో ప్రతిపాదన.. కార్యరూపంలోకి తెస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినప్పటికీ శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు కంటి తుడుపుగా కేవలం రూ.200 కోట్లతోనే సరిపెట్టింది. పారిశ్రామికంగా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపును పొందిన రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయంలోనూ అగ్రస్థానంలో నిలుస్తూ వస్తున్నది. అయితే ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలో నిర్మించనున్న అనంతగిరి ఎకో టూరిజంపై బడ్జెట్‌లో ప్రస్తావించినప్పటికీ.. రాష్ట్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం గతంలోనే కొంతమేర నిధులు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులకు సంబంధించి బడ్జెట్లో ఎలాంటి ప్రస్తావన లేదు. వికారాబాద్ జిల్లాకు మణిహారంగా మారనున్నదని ప్రజానీకం కలలుగన్న మొబిలిటీ వ్యాలీకి నిధులు కేటాయించలేదు. ఆరేడు నెలలుగా నిలిచిపోయిన ఈ పనులు బడ్జెట్ అనంతరం వేగవంతమవుతాయని అనుకున్న జిల్లా ప్రజల ఆశలపై రేవంత్ ప్రభుత్వం నీళ్లు చల్లింది.

పాలమూరు పరుగులకు బ్రేక్ ..

కేసీఆర్ ప్రభుత్వంలో పరుగులు పెట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సైతం కాంగ్రెస్ ప్రభుత్వం బ్రేకులు వేసింది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులేవీ జరపక రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి కృష్ణా జలాలను ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలకు తరలించేందుకు కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2015లో శ్రీకారం చుట్టింది. రూ.35వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన ఈ ఎత్తిపోతలతో మొదటి విడతలో తాగునీటికి సంబంధించిన పనులను, రెండో విడతలో సాగునీటికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. తెలంగాణ ప్రభుత్వం అకుంఠిత దీక్షతో చేసిన పోరాటంతో ఎత్తిపోతలకు సంబంధించిన అన్ని అడ్డంకులు తొలగిపోయి పనులు పరుగులు పెట్టాయి. గతేడాది అప్పటి సీఎం కేసీఆర్ లాంఛనంగా నీటిని సైతం విడుదల చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఉద్దండాపూర్ రిజర్వాయర్ నుంచే సాగు, తాగు నీటిని అందించేలా ప్రభుత్వం డిజైన్ చేయగా.. ఇందుకు సంబంధించి రూ.5,180 కోట్లను గత ప్రభుత్వం కేటాయించింది. ఉద్దండాపూర్ నుంచి నిర్మించే మెయిన్ కెనాల్ 16.5కిలోమీటర్ల వద్ద లెఫ్ట్, రైట్ కెనాల్స్‌ను నిర్మించి నీరందించేలా డిజైన్ చేశారు. లెఫ్ట్ కెనాల్ నుంచి వికారాబాద్ జిల్లా వైపుగా.. రైట్ కెనాల్ నుంచి రంగారెడ్డి జిల్లా ప్రాంతాలతో పాటు మునుగోడు వరకు నీరందించేలా గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాంత రైతాంగానికి జీవనాడిగా ఉన్న ఎత్తిపోతల పట్ల ఆదినుంచీ నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ వస్తున్న ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో ప్రత్యేకించి ఎటువంటి నిధులను కేటాయించకపోవడంతో పనుల కొనసాగింపుపై సందిగ్ధత నెలకొన్నది.

అటకెక్కనున్న సంక్షేమ పథకాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలతోపాటు గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల కొనసాగింపుపై నీలినీడలు అలుముకున్నాయి. బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరపకపోవడంతో గ్యారంటీల అమలుపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దళిత కుటుంబాల సాధికారతకోసం దళితబంధును చేపట్టి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలమంది లబ్ధిదారులకు రూ.10లక్షల చొప్పున అందజేసింది. ఆ డబ్బులతో వారు పశు పోషణ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కోళ్ల ఫారం, రవాణా రంగాలకు సంబంధించిన యూనిట్లను లబ్ధిదారులు ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. రెండో విడతలో మరింతమందికి సాయం అందించేందుకు కార్యాచరణ మొదలుపెట్టగా..ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. అలాగే..కులవృత్తులకు జీవం పోయాలని సంకల్పించిన కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకం ద్వారా తొలి విడతలో వేల మంది గొల్లకురుమలకు మేలు జరుగగా.. రెండో విడతలో మరిన్ని యూనిట్ల అందించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు నిధులను కూడా వెచ్చించేందుకు కార్యాచరణను రూపొందించగా... ఎన్నికలు రావడంతో ఈ పథకానికి సైతం బ్రేక్ పడింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ దళిత బంధు, గొర్రెల పంపిణీ పథకాలను కొనసాగించేలా బడ్జెట్‌లో ఎటువంటి నిధుల కేటాయింపులు జరపకపోవడంతో వీటికి మంగళం పాడినట్లేనని తెలుస్తున్నది. ఇక బడ్జెట్‌లో రైతు భరోసా ప్రస్తావనే లేదు.

బడ్జెట్‌పై వెల్లువెత్తుతున్న అసంతృప్తి..

రాష్ట్ర బడ్జెట్‌పై అని వర్గాల్లో అసంతృప్తి వెల్లువెత్తుతున్నది. ఎన్నికల ముందు ఎన్నో హామీలను గుప్పించిన కాంగ్రెస్.. బడ్జెట్‌లో మాత్రం అందుకనుగుణంగా కేటాయింపులు జరుపలేదని ప్రజలు వాపోతున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రస్తావనే లేకపోవడంపై మండిపడుతున్నారు. మొదటి నుంచి పాలమూరు ప్రాజెక్టుపై పగబట్టిన కాంగ్రెస్.. బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించకుండా పంతం నెగ్గించుకున్నదని దుయ్యబడుతున్నారు. పారిశ్రామికరంగానికి సంబంధించి పాలసీ ఏ విధంగా ఉంటుందనే దానిపై ఔత్సాహికులు ఆశగా ఎదురుచూడగా అసలు ఈ విషయమై చర్చించకపోవడం వారిని తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెలు, చేపపిల్లల పంపిణీని విస్మరించి వారి జీవితాలను అగాథంలోకి నెట్టిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2 వేల సాయం అందిస్తామని హామీనిచ్చి బడ్జెట్‌లో అందుకు సంబంధించి నిధులు కేటాయించకపోవడంపై ప్రజలు భగ్గుమంటున్నారు.

తీవ్ర అన్యాయం...

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు, కుల వృత్తిదారులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ .. నిబంధనల పేరుతో చాలామంది అర్హులైన రైతులను రుణమాఫీకి దూరం చేసింది. రూ.లక్షలోపు రుణాలకు సంబంధించి కొంతమంది రైతులకే మాఫీ చేసి చేతులెత్తేసింది. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్‌లకు ఎలాంటి షరతులు లేకుండా పెట్టుబడి సాయాన్ని అందజేస్తే.. కాంగ్రెస్ వానకాలం సీజన్ సగం పూర్తయినా ఇప్పటికీ సాయం అందించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిధులు లేక అస్తవ్యస్తంగా మారిన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసింది.

వివిధ కులవృత్తులు, మహిళలు, యువతకు సంబంధించిన పథకాలకు బడ్జెట్ కేటాయింపులు చేపట్టకపోవడం, జిల్లాలో విద్య, వైద్య, రవాణా తదితర రంగాలకు ప్రత్యేకించి ఎటువంటి నిధులను కేటాయించకపోవడంపై సబ్బండ వర్గాల ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

లక్షన్నర కోట్లని చెప్పి 1500 కోట్లు ఇచ్చారు

మూసీ ప్రక్షాళనపై ఆర్భాటంగా ప్రకటనలు

కేటాయింపుల్లో లేని ప్రాధాన్యత
వ్యయంలో 1 శాతమే కేటాయింపు
భూసేకరణకే సరిపోని నిధులు

సిటీబ్యూరో, జూలై 25(నమస్తే తెలంగాణ) : ''మూడేళ్లలో మూసీని థేమ్స్ తరహాలో డెవలప్ చేస్తాం. ఇప్పటికే డీపీఆర్ కూడా సిద్ధమైంది. వచ్చే ఐదేళ్లలో 1.5 లక్షల కోట్లు ఖర్చు చేసి మూసీతో హైదరాబాద్‌కు వన్నెతీసుకువస్తాం. విశ్వనగరానికి ప్రతీకగా, ప్రపంచ స్థాయిలో మూసీని తీర్చిదిద్దుతాం'' అంటూ మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ మూసీలో నురగలాంటిదేనని తేలిపోయింది. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా చెప్పుకుంటూ ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ బీరాలు పోయింది. ఖర్చు చేసుడు దేవుడెరుగు కనీసం మూసీ కేటాయింపుల్లోనే అత్తెసరు నిధులతో లెక్కలు చూపించింది. ఇక లెక్కలు తేలి, పనులు మొదలుపెట్టాలంటే బారెడున్న మూసీ సుందరీకరణ మూరెడు నిధులతో ఎలా సాధ్యం అవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కేటాయించిన రూ. 1500 కోట్లు 56కిలోమీటర్ల విస్తరించి ఉన్న భూసేకరణకు కూడా సరిపోయేలా లేవని అధికార వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

ఫ్లాగ్‌షిప్‌నకు ఒక్క శాతం నిధులు..

మూసీ ప్రక్షాళన కోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అధికారులు నదికి ఇరువైపులా ఉన్న సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించింది. దాదాపు 55 కిలోమీటర్ల మేర 12వేలకు పైగా ఆక్రమ నిర్మాణాలను గుర్తించింది. ఇందులో ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ శాఖ ఆస్తులతోపాటుగా పట్టా భూములు కూడా ఉన్నాయి. వీటన్నింటిని తొలగించి మూసీ పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే భూసేకరణకు భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓ అంచనా ప్రకారం ఇప్పటివరకు లెక్కతేల్చిన మొత్తం నిర్మాణాల్లో 60 శాతం నిర్మాణాలకు పరిహారాన్ని చెల్లించాలంటే వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఇక డీపీఆర్, ప్రాజెక్టు నిర్మాణం, మౌలిక వసతుల పేరిట భారీ మొత్తంలోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. మూసీపై ఉన్న వంతెనల నిర్మాణం, ఆధునీకరణ, ఎస్‌టీపీల నిర్మాణం, మురుగు నీటిని తరలింపు వంటి అంశాలకు భారీ వేలలో ఖర్చు చేయాల్సి ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం కేటాయించిన రూ. 1500 కోట్లు మూసీ అభివృద్ధిలో దేనికోసం ఖర్చు చేయాలనే విషయంలో ఇప్పటికీ అధికారులు స్పష్టత లేకుండా పోయింది. మూసీ మురుగును తొలగించడమే తన లక్ష్యమని, తనకు ఈ ప్రాజెక్టు ఎంతో ప్రతిష్టాత్మకమని చెప్పుకుంటూ, ప్రాజెక్టు వ్యయాన్ని మూడు నెల్లో లక్షన్నర కోట్లకు సీఎం రేవంత్ రెడ్డి పెంచేశారు. ఆ స్థాయి ప్రాజెక్టుకు మొత్తం అంచనా వ్యయంలో ఒక్కశాతం నిధులను కేటాయించడం, ప్రాజెక్టును ఆచరణలో పెట్టడం ఎలా సాధ్యం అవుతుందనే విమర్శలు వస్తున్నాయి. కనీసం మూసీ సుందరీకరణ కోసం ఇప్పటివరకు ఆహ్వానించిన టెండర్లను అమలు చేయాలంటేనే కనీసం 400-500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందనే చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం కేటాయించిన నిధులతో మూసీ ఎలా మురిపిస్తారంటూ నగర వాసులు చర్చించుకుంటున్నారు.

జలమండలికి ఏ మూలకూ సరిపోవు

- అడిగింది 5580 కోట్లు
- ఇచ్చింది 3385 కోట్లు
- కరెంటు బకాయిలను పట్టించుకోని ప్రభుత్వం
- సుంకిశాలకు, ఇతర ప్రాజెక్టులకు అరకొర కేటాయింపులే
- అదనపు గోదావరి జలాలపై దృష్టి పెట్టని సర్కారు

సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ) : జలమండలి 5580 కోట్ల రూపాయలు అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 3385 కోట్లు మాత్రమే ఇచ్చింది. వేసవిలోనూ ఏ ఆటంకమూ లేకుండా నగరానికి నీరందించేందుకు నాగార్జున సాగర్ వద్ద నిర్మితమవుతున్న అత్యంత కీలకమైన సుంకిశాల ప్రాజెక్టుకు అరకొర నిధులే ప్రకటించింది. జలమండలికి భారంగా మారిన 4500 కోట్లకు పైగా విద్యుత్ బిల్లుల బకాయిలపై భరోసా కల్పించలేదు. ఈ విషయంలో సబ్సిడీ ఇవ్వాలని 400కోట్ల మేర ప్రతిపాదనలు పంపించగా కేటాయింపుల్లో మాత్రం చిల్లిగవ్వ విదల్చలేదు

కేసీఆర్ హయాంలో యుద్ధ ప్రాతిపదికన.. ఇప్పుడు నత్తనడకన

నగరవాసులకు తాగునీటి విషయంలో ఏడాది పొడవునా పూర్తి భరోసా దక్కేలా గత కేసీఆర్ ప్రభుత్వం నాగార్జున సాగర్ సమీపంలో సుంకిశాల వద్ద రూ 2214 కోట్లతో ప్రాజెక్టును చేపట్టింది. సుంకిశాల పథకంలో భాగంగా ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా సాగర్‌లో నీటి మట్టం 510 అడుగుల దిగువకు (డెడ్‌స్టోరేజీ) పడిపోయినా అక్కడి నుంచి నీరు తీసుకునేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. అయితే గత ప్రభుత్వంలో స్థల సేకరణ నుంచి పంప్‌హౌస్ నిర్మాణం వరకు యుద్ధప్రాతిపదికన సాగిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే నత్తనడకన సాగుతున్నాయి. వాస్తవానికి ఈ ప్రాజెక్టు డిసెంబర్ నాటికల్లా వస్తుందని భావించారు. కానీ ప్రభుత్వం కేవలం రూ.1000 కోట్లు మాత్రమే కేటాయించడంతో ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాదికి కూడా అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనబడడం లేదు. మరోవైపు ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభమై కొనసాగుతున్న ఎస్టీపీలు, సీవరేజీ, వాటర్‌సేఫ్టీ ప్లాన్‌లకు 2280 కోట్లు అడిగితే సర్కారు కేవలం 1450కోట్లు మాత్రమే కేటాయించింది. కాగా, నగరంలో అమలవుతున్న ఉచిత మంచినీటి పథకానికి 300 కోట్లు ఇచ్చింది.

అదనపు గోదావరి జలాలు.. రానట్టేనా?

సంవత్సరం పొడవునా నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు 30 టీఎంసీలు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జంట జలాశయాలకు గోదావరి జలాలను తరలించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు పలుమార్లు హామీ లిచ్చింది. బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం నగరవాసులను విస్మయపరిచింది.

అరకొరే ఇచ్చారు

మెట్రో విస్తరణకు 24042 కోట్లు అవసరం

- సర్కారు ప్రకటించింది 1100 కోట్లే
- ఆస్తుల సేకరణకే ఆ నిధులు చాలవు
- ఇంకా కావలసింది 22,942 కోట్లు

సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ): అంతన్నారు... ఇంతన్నారు... ఆఖరుకు అత్తెసరుతో సరిపెట్టారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ప్రతిపాదిత మెట్రో కారిడార్ల విస్తరణలో ఆస్తుల సేకరణకే సరిపోని పరిస్థితి. ఆర్భాటంగా ప్రచారాలు చేసి హడావుడిగా శంకుస్థాపనలు చేసి కొండంత రాగం తీసిన ప్రభుత్వం తీరా బడ్జెట్‌లో మాత్రం అరకొరగా ప్రకటించి చేతులు దులుపుకొన్నది. ప్రభుత్వం విస్తరించాలనుకున్న 78.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో కారిడార్లకు గాను అవసరమైన వ్యయం రూ.24,042 కోట్లు. కానీ బడ్జెట్‌లో మాత్రం కేవలం 1100 కోట్లు కేటాయించారు.

పొంతన లేని బడ్జెట్ ?

గత కేసీఆర్ ప్రభుత్వం 2023 బడ్జెట్‌లో మెట్రో విస్తరణకు రూ.2500 కోట్లను కేటాయించి రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు పనులు మొదలు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేసింది. మెట్రో రెండో దశ ప్రతిపాదనలను సమీక్షించి వాటిని సవరించి కొత్త ప్రతిపాదనలను రూపొందించింది. 78.4 కిలోమీటర్ల పొడవైన కొత్త మెట్రో కారిడార్‌ను 24,042 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మెట్రో రైలును పాత నగరానికి 5.5 కిలోమీటర్ల మేర పొడిగించి దాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేయాలని ప్రణాళిక రచించారు. ఎల్బీనగర్ నుంచి నాగోలుకు 7 కిలోమీటర్ల మేర కారిడార్‌ను విస్తరించాలని, నాగోలు, ఎల్బీనగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ చేంజ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 24వేల కోట్లకుపైగా వ్యయమయ్యే మెట్రో పనుల విస్తరణపై ఆర్భాటంగా ప్రకటనలు చేసి కేవలం 5 శాతం నిధులే సమకూర్చితే పనులు సాగేదేలా అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

బడ్జెట్‌లో కేటాయింపులు (కోట్లలో)	
హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్‌కు	500
పాత నగరం మెట్రో కోసం	500
ఎయిర్‌పోర్టు మెట్రో కోసం	100
మొత్తం ప్రకటించింది	1100
మెట్రో విస్తరణకు	
అవసరమయ్యే వ్యయం	24,042
ఇంకా అవసరమయ్యే నిధులు	22,942

రైతులను మోసం చేస్తున్నది..

కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో అన్నదాతలకు మొండి చేయి చూపింది. అత్తెసరు రుణమాఫీలు చేసి చేతులు దులుపుకుంటుండడంతో పాటు అదునుకందాల్సిన రైతు భరోసా జాడే లేదు. ఎరువులు కొనుగోలుకు, నాట్లు వేసుకునేందుకు అప్పులు చేయాల్సి వస్తున్నది. ఈ ఏడాది బడ్జెట్‌లో పేదలు, కుల వృత్తుల వారిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతనే లేదు. గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన బిల్లులపై ఎలాంటి హామీ ఇవ్వలేదు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు.

– లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కడ్తాల్ మండలం

ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేశారు..

కాంగ్రెస్ ప్రభుత్వానికి గొప్పలు చెప్పుకోవడమే తప్ప చేతలు లేవని స్పష్టమవుతున్నది. రూ. 2 లక్షల 91 వేల 159 కోట్ల బడ్జెట్ అని చెప్పుకోవడం తప్ప, దళితబంధు పథకానికి నిధులు కేటాయించకుండా దళితులకు ఏం న్యాయం చేస్తారో చెప్పాలి. పేదరికంలో మగ్గుతున్న వేలాది గిరిజన కుటుంబాలను ఏ విధంగా ఆదుకుంటారో స్పష్టత ఇవ్వలేదు. ఇక సాగునీటి ప్రాజెక్టుల ఊసే లేదు. పాలమూరు ఎత్తిపోతలతో పాటు ఇతర ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం బాధాకరం. పారిశ్రామిక రంగానికీ కంటితుడుపు చర్యగా నిధులు కేటాయించడం విడ్డూరం.

– రాంబల్‌నాయక్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, షాద్‌నగర్

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు నిరాశే..

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు నిరాశే మిగిల్చింది. ఏ ఒక్క వర్గానికీ సరిగ్గా న్యాయం జరగలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ప్రతి ఏడాది అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ రూపొందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి అండగా నిలిచింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రజలను మోసం చేసింది. రుణమాఫీ విషయంలోనూ ఎంతోమంది రైతులకు అన్యాయం జరిగింది. రైతుభరోసాపై స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరం.

– కుమ్మరి దర్శన్, తెలంగాణ ఉద్యమకారుడు, షాబాద్

దళితుల ప్రస్తావనే లేదు..

ఆర్థికంగా వెనుకబడిన దళితులను మాజీ సీఎం కేసీఆర్ గుర్తించి దళితబంధు పథకాన్ని తెచ్చి భారీ నిధులు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నేడు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దళితబంధు మాటే ఎత్తకుండా ఏమాత్రం నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసింది. అణగారిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తున్నదని ఎన్నికల్లో ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ఏమీ పట్టనట్లుగా ఉండడం మంచి పద్ధతి కాదు. దళితుల బాగోగులను పట్టించుకోని రేవంత్ సర్కార్‌కు రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం తప్పదు.

–గునిగారి అంజి,మోత్కూర్ గ్రామం, దోమ మండలం

దివ్యాంగులకు అరకొరగా..

బడ్జెట్‌లో దివ్యాంగులకు అరకొరగా నిధులు కేటాయించిండ్రు. తెలంగాణలో 8 లక్షల దివ్యాంగుల ఓట్లు ఉన్నాయి. పింఛన్లు పెంచుతామని చెప్పి ఓట్లు వేయించుకుని మొండిచెయ్యి చూపిస్తున్నరు. మా ఓట్లేసుకుని గెలిచినోళ్లు మమ్మల్ని మర్చిపోవడం బాధగా ఉన్నది. ప్రజల బాగోగులు చూసుకోలేని చేతకాని ప్రభుత్వమని అర్థమవుతున్నది. పింఛన్లు పెంచుతామని మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడుస్తున్నది. నేటికీ పింఛన్ డబ్బులు అందలేదు. సరైన నిధులు కేటాయించని కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం.

– చెలిమల్ల గోవర్ధన్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామం

పెట్టుబడి సాయానికి నిధులేవీ ?

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎవుసానికి పెట్టుబడి సాయం ఊసెత్తకపోవడం బాధాకరం. కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధు డబ్బులు రంచన్‌గా పడేవి. అదునుకందడం వల్ల వ్యవసాయం పండుగలా సాగింది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత గొప్పలు చెప్పడమే కాని ఇంత వరకు రైతుభరోసానే లేదు. వ్యవసాయ పనులు ప్రారంభంలోనే ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీకీ రాబోవు రోజుల్లో మేమేంటో చూపిస్తాం